## ఎమ్మెల్యే గాంధీ బెదిరిస్తున్నడు

**నా భూమి రిజిస్టర్ చేయాలంటున్నాడు**

**హైకోర్టులో సులోచన అగర్వాల్ పిటిషన్**

**నివేదిక సమర్పించాలని పోలీసులకు కోర్టు ఆదేశం**




హైదరాబాద్, జూలై 24, ప్రభాతవార్త: జీడిమెట్లలోని సర్వే నంబర్ 38/8, 38/9లో ఉన్న భూమిని తన పేరిట రిజిస్టర్ చేయ్యాలంటూ తన కుటుంబాన్ని బెదిరించారని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపుడి గాంధీపై హైకోర్టులో సులోచన అగర్వాల్ పిటిషన్ వేశారు. అర్ధరాత్రి ఎమ్మెల్యే గాంధీ మనుషులు తన ఫ్యాక్టరీలో దోపిడీ చేసినా పోలీసులు స్పందించ లేదని పిటిషన్‌లో తెలిపారు. ఇరవై కోట్ల రూపాయల యంత్రాలను, అల్యూమినియం బండిల్ లను గాంధీ పోలీసుల సాయం తో తీసుకెళ్లారని కోర్టు దృష్టికి తీసు కువచ్చారు. పిటిషన్‌ను విచారించిన హైకోర్టు ఘటనపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్, ఎస్ఐ మల్లేశ్వర్‌లను ఆదేశించింది. ఎమ్మెల్యే గాంధీకి వ్యక్తిగ తంగా నోటీసులు పంపాలని పిటిషనర్‌కు కోర్టు సూచించింది. తదుపరి విచారణ ఆగస్టు 10కి వాయిదా వేసింది.

## బిజెపి ధర్నాను విజయవంతం చేయాలి

సరూర్‌నగర్, జూలై 24 ప్రభాతవార్త: ప్రజా సమస్యలపై మంగళవారం ఉదయం నగరంలోని ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు, బండ్లగూడ సింగిల్‌విండో మాజీ ఛైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి పిలుపు నిచ్చారు.

హైదరాబాద్ వార్త



# వర్షం పడితే.. నగరం ఉక్కిరి బిక్కిరి!

**ఒక్కసారిగా వర్ష బీభత్సం ❒ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు, ట్రాఫిక్‌జాం**

జలదిగ్బంధంలో పలు కాలనీలు

ట్రాఫిక్ జామ్‌తో నరకయాతన

గంటల కొద్దీ రోడ్లపైనే వాహనాలు







హైదరాబాద్, జులై 24 ప్రభాతవార్త : నగరంలో భారీ వర్షాలు బీభత్సం సృష్టించింది.సోమవారం ఉదయం వరకు అక్కడక్కడ అలుముకున్న ముసురు.. సాయంత్రం వచ్చేసరిగా ఒక్కసారిగా భారీ వర్షం దంచికొట్టింది. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో పలు చెట్లు నేలకూలి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వర్షానికి రహదారులన్నీ జలమయం అయ్యాయి. చెరువులను తలపించేలా మారిన రోడ్లపై రాకపోకలు సాగించేందుకు నగరవాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బోరబండ, ఎర్రగడ్డ, సనత్‌నగర్, యూసుఫ్‌గూడ, అమీర్‌పేట్, ఎస్సార్‌నగ్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఖైరతాబాద్, పంజాగుట్ట ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, కొండాపూర్, దోమలగూడ, హిమాయత్‌నగర్, ట్యాంక్‌బండ్, సికింద్రాబాద్ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. రాజేంద్రనగర్, అల్తాపూర్, గండిపేట, కోఠి, సుల్తాన్‌బజార్, అబిడ్స్, బేగంబజార్, నాంపల్లి, బషీర్‌బాగ్, కాచిగూడ, నల్లకుంట, విద్యానగర్లఓ భారీ వర్షం కురిసింది. కుత్బుల్లాపూర్, తిరుమలగిరి, అల్వాల్, బోయిన్‌పల్లి, బవహర్‌నగర్, బేగంపేట్, బొల్లారం, మారేడుపల్లి, చిలకలగూడ, బోడుప్పల్, లాలాపేట్, తార్నాక, హబ్సిగూడ, దోమలగూడ, అశోక్‌నగర్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది.భారీ వర్షం నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు రావొద్దని జిహెచ్‌ఎంసి అధికారులు హెచ్చరించారు. అనవసర ప్రయాణాలు చేయవద్దని డిఆర్‌ఎఫ్ బృందాలు హెచ్చరించాయి. అత్యవసర పరిస్థితుల్లో సహాయక చర్యల కోసం 040-21111111, 9000113667 నంబర్లకు సంప్రదించాలని జిహెచ్‌ఎంసి సూచించింది.

**పొంగిపొర్లిన నాలాలు..** ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షాలు కురుస్తున్నాయి.నగరంలో కురుస్తున్న భారీ వర్షానికి వీధులన్నీ జలమయమయ్యాయి. రహదారులు చెరువులను తలపించాయి. వరద ఉద్ధృతికి మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లడంతో మూతలు పైకి తేలాయి. జనం రోడ్లపై నడవలేని పరిస్థితి తలెత్తింది.భారీ వర్షానికి గాజులరామారం పెద్ద చెరువు పొంగిపొర్లింది. దాంతో వరద నీరు జనావాసాల్లోకి చొచ్చుకొచ్చింది. ఈ క్రమంలో ఎగువ నుంచి నీటి ప్రవాహం వస్తుండటంతో నిన్నటి నుంచి గాజులరామారంలోని వీనస్‌కాలనీ, ఒక్షిత్ ఎన్‌క్లేవ్ పరిసర ప్రాంతాలు వరదనీటిలోనే మగ్గుతున్నాయి. మోకాళ్లలోతు వరద నీరు ప్రవహిస్తుండడంతో ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. హుస్సేన్‌సాగర్ నీటిమట్టం గరిష్టస్థాయికి చేరడంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దుండిగల్ మున్సిపాలిటీలోని బహదూర్‌పల్లిలో ప్రధాన రహదారులు, కాలనీ రోడ్లు నదులుగా మారాయి.లోతట్టు ప్రాంతాలలో ఇళ్లలోని వరద నీరు వచ్చి చేరింది. కూకట్‌పల్లి ఐడిఎల్ చెరువు,సరూర్‌నగర్ చెరువులోకి ఎగువ ప్రాంతం ఉంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది.జంట జలాశయాలతో పాటుగా హుస్సేన్ సాగర్‌లో కూడా భారీ వరద నీరు వచ్చి చేరుతోంది.

**భారీగా ట్రాఫిక్ జామ్..** వర్షానికి నగరంలో చాలా చోట్ల భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో ఆఫీసులు, విద్యాసంస్థల నుండి నివాసాలకు పోయే వాళ్లు అవస్థలు పడ్డారు. వాహనాలు నెమ్మదిగా కదులుతుండటంతో నరకయాతన పడ్డారు. వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారి ఉప్పల్ కూడలి వద్ద భారీగా వర్షం నీరు చేరడంతో రాకపోలకు ఇబ్బందిగా మారింది.జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, కేబీఆర్ పార్కు, జూబ్లీహిల్స్ రోడ్ 45, రోడ్ నంబర్ 10, పెద్దమ్మతల్లి రోడ్డు, అపోలో హాస్పిటల్ రోడ్‌లో వర్షం కారణంగా పెద్దఎత్తున ట్రాఫిక్ జామ్ అయ్యింది.జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో ట్రాఫిక్ డైవర్షన్ ఉన్న రోడ్లపై వాహనాలు నిలిచిపోయాయి.దీంతో ట్రాఫిక్‌లో వాహనదారులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. రోడ్లపై ఓవైపు వర్షం, మరోవైపు ట్రాఫిక్‌తో రెండు మూడు కిలోమీటర్ల ప్రయాణినికి గంట సమయం పడుతోందని వాహనదారులు పేర్కొన్నారు. నగరంలో ప్రధాన రోడ్లు లింగంపల్లి నుంచి ఖైరతాబాద్, సికింద్రాబాద్ నుంచి హైటెక్ సిటీ వరకు భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఖైరతాబాద్ చౌరస్తా, విద్యుత్ సౌధ, నిమ్స్, పంజాగుట్ట, ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. సికింద్రాబాద్ నుంచి కోఠి వరకు ఫుల్ ట్రాఫిక్ ఉంది. కేపిహెచ్‌పి, జేఎన్టీయూ నుంచి హైటెక్‌సిటీ రోడ్డుపై 5కి.మీ మేర ఫుల్ ట్రాఫిక్ జామ్ అయ్యింది. సికింద్రాబాద్-బేగంపేట్, హిమాయత్‌నగర్, హైదర్‌గూడ, అంబర్‌పేట, ఫీవర్ హాస్పిటల్, ఉప్పల్-మేడిపల్లి తదితర ప్రాంతాల్లో తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ట్రాఫిక్ జామ్‌కి శాశ్వత పరిష్కారం దొరికేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రమాదకర ఫ్లైఓవర్

**బయోడైవర్‌సిటీ ఫ్లైఓవర్ మీద మరో ప్రమాదం**

**యువకుడి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు**



బయోడైవర్‌సిటీ ఫ్లైఓవర్‌ను పరిశీలిస్తున్న మాదాపూర్ డిసిపి సందీప్ తదితరులు

గచ్చిబౌలి, జూలై 24 ప్రభాతవార్త : ప్రమాదకర బయోడైవర్‌సిటీ ఫ్లైఓవర్ మీద ఎన్ని రక్షణ చర్యలు తీసుకుంటున్నా ఫలితం లేకుండా పోతుంది. వంకలు తిరిగిన ఈ ఫ్లైఓవర్ నిర్మాణంపై గతంలోనే విమర్శలు వ్యక్తం కాగా, ప్రమాదకరంగా ఉన్న మలుపుల కారణంగా గతంలో పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. పోలీసులు, అధికారులు ఈ ఫ్లైఓవర్ మీద ఎన్ని రక్షణ చర్యలు ఏర్పాటు చేసినా ఫలితం లేకపోగా, తరచూ ప్రమాదాలు చోటుచేసుకొని వాహనదారులు మృత్యు వాత పడుతున్నారు. తాజాగా బయోడైవర్‌సిటీ లెవెల్ 2 ఫ్లైఓవర్ మీద నుంచి ద్విచక్రవాహనం మీద వెళ్తున్న ఇద్దరు యువకులు అదుపుతప్పి లెవెల్ 1 ఫ్లైఓవర్ మీద పడిపోవడంతో ఓ యువకుడు మృతి చెందగా, మరో యువకుడు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. ద్విచక్రవాహనం మితిమీరిన వేగంతో పాటు ఫ్లైఓవర్ నిర్మాణ ఆకృతిలో ఉన్న లోపాల కారణంగానే ప్రమాదం చోటుచేసుకుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.



ప్రమాదంలో మృతిచెందిన బండి మధు(ఫైల్‌ఫోటో)


మెదక్ జిల్లా కుకునూర్‌పల్లి మండలం మునుగోలు గ్రామానికి చెందిన బండి మధు(26), యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం తేర్యాల గ్రామానికి చెందిన పంజాల మచ్చగిరి(24)లు నగరానికి వచ్చి రాయదుర్గం పరిధిలోని మధురానగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరు ఇరువురు గచ్చిబౌలిలోని తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(టిమ్స్) ఆసుపత్రిలో ఎంఆర్ఐ టెక్నీషియన్లుగా పనిచేస్తున్నారు. కాగా ఆదివారం రాత్రి 10.45గంటల ప్రాంతంలో వీరు తాము నివాసం ఉంటున్న మధురానగర్ కాలనీ నుంచి మాదాపూర్ వైపు (టిఎస్36 కె5128) యమహా ఎంటి15 మీద బయలుదేరారు. బండి మధు ద్విచక్రవాహనం నడుపుతుండగా, మచ్చగిరి వెనుక కూర్చున్నాడు. మాదాపూర్ వెళ్లే క్రమంలో వీరు బయోడైవర్‌సిటీ లెవెల్ 2 ఫ్లైఓవర్ ఎక్కారు. ఫ్లైఓవర్ మీద వీరు ప్రయాణిస్తున్న వాహనం అతివేగం కారణంగా అదుపుతప్పడంతో ఫ్లైఓవర్ రెయిలింగ్‌ను ఢీకొట్టారు. దీంతో వాహనం కిందపడిపోగా, బండి మధు, మచ్చగిరిలు ఒక్కసారిగా గాలిలో ఎగురుతూ కింద ఉన్న లెవెల్ 1 ఫ్లైఓవర్ మీద పడిపోయారు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన బండి మధు అక్కడికక్కడే మృతిచెందగా, మచ్చగిరికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని మచ్చగిరిని స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో మృతిచెందిన బండి మధు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం మచ్చగిరి ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈమేరకు రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

**ఫ్లైఓవర్‌ను పరిశీలించిన మాదాపూర్ డిసిపి..**

బయోడైవర్‌సిటీ ఫ్లైఓవర్ మీద మరో ప్రమాదం చోటుచేసుకోవడంతో సోమవారం మాదాపూర్ డిసిపి గోనె సందీప్ ఫ్లైఓవర్‌ను పరిశీలించారు. గతంలో సైతం ఈ ఫ్లైఓవర్ మీద పలు ప్రమాదాలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. గతంలో ఈ ఫ్లైఓవర్ మీద నుంచి అదుపుతప్పిన కారు కిందపడి ఓ మహిళ మృతిచెందడం, ఫ్లైఓవర్ మీద సెల్ఫీ తీసుకుంటున్న యువకులను కారు ఢీకొట్టడంతో యువకులు మృతిచెం దిన ఘ టనలు చోటుచేసుకున్నాయి. ఈ ఫ్లైఓవర్ పూర్తిగా మలుపులు తిరిగి ఉండడంతో వేగంగా వస్తున్న వాహనాలు నియంత్రణ కోల్పోతు న్నాయి. దీంతో గతంలో పోలీసులు ఫ్లైఓవర్ మీద స్పీడ్ లిమిట్‌ను 30కిలోమీటర్లకు పరి మితం చేసి,స్పీడ్ బ్రేకర్లు, రెయిలింగ్ మీద రక్షణ చర్యలు తీసుకున్నారు. కాగా రాత్రి వేళల్లో వేగంగా వస్తున్న వాహనాలు ఫ్లైఓవర్ మీద ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్ల వద్ద అదుపుతప్పు తున్నాయి. తాజాగా చోటుచేసుకున్న ప్రమాదంలో సైతం యువకుల ద్విచక్రవాహనం స్పీడ్ బ్రేకర్లను దాటిన వెంటనే అదుపుతప్పి రెయిలింగ్‌ను ఢీకొట్టినట్లు తెలుస్తుంది. ద్విచక్రవాహనం మితిమీరిన వేగంతో ఉండడంతో స్పీడ్ బ్రేకర్ల వద్ద కుదుపులకు అదుపుతప్పి ఉంటుందని భావిస్తున్నారు. ఈ మేరకు మాదాపూర్ డిసిపి గోనె సందీప్, రాయదుర్గం ఇన్స్‌పెక్టర్ మహేశ్‌లు ఫ్లైఓవర్‌ను సందర్శించి, తీసుకోవాల్సిన రక్షణ చర్యలను పరిశీలించారు.

# గుడ్లు చిన్న.. లెక్కలు మిన్న

- అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నసైజు గుడ్లు
- సరఫరాలో కాంట్రాక్టర్లదే ఇష్టారాజ్యం
- అండగా ఉండే అధికారులకు వాటాలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు





హైదరాబాద్, జూలై 24, ప్రభాతవార్త: చిన్నపిల్లలకు,బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ సెంటర్లను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. కాని ఆశయం ఘనంగా ఉన్నా అమలు మాత్రం అస్తవ్యస్తంగా ఉంది. అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం అందని ద్రాక్షలాగే మారుతోంది. ఏదో ఒకర్రీ చూపెట్టి నాణ్యత లేని ఆహారం అందిస్తున్నారనే ఆరోపణలు మెండుగా వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం ఫలితంగా తక్కువ పరిమాణం కలిగిన గుడ్లను సరఫరా చేయడం కాంట్రాక్టర్లకు నిత్యకృత్యంగా మారింది .హైదరాబాద్ జిల్లాలో ఐదు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా వీటిపరిధిలో 914కేంద్రాలు పని చేస్తున్నాయి. వీటిలో సుమారు 63,984 మంది చిన్నారులు నమోదై ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. చార్మినార్ ప్రాజెక్ట్ పరిధిలో సైదాబాద్, అంబర్‌పేట్, చార్మినార్,బండ్లగూడ మండలాల్లో మొత్తం 257కేంద్రాలు ఉన్నాయి. ఖైరతాబాద్ ప్రాజెక్ట్ పరిధిలో అంబర్‌పేట్,ఖైరతాబాద్ షేక్‌పేట్,బాలానగర్ మండలాల్లో 141 కేంద్రాలు, గోల్కొండ ప్రాజెక్ట్ పరిధిలో అసీఫ్‌నగర్ గోల్కొండ మండలాల్లో కలిపి 154కేంద్రాలు,నాంపల్లి ప్రాజెక్ట్ పరిధిలోని హిమాయన్‌నగర్, బహదూర్‌పురా, నాంపల్లి మండలాల్లో కలిసి 191 కేంద్రాలు, సికింద్రాబాద్ ప్రాజెక్ట్ పరిధిలో సికింద్రాబాద్ మారేడ్‌పల్లి, తిరుమలగిరి, ముషీరాబాద్ మండలాల్లో 171కేం ద్రాలు కొనసాగుతున్నాయి. అయితే గడ్డు ఇస్తున్నారు కదా.. చిన్నదౌతేనేం అని అనుకోవచ్చు. కానీ జరిగే మాయాజాలం ఇక్కడే ఉంది. సాధారణంగా నిర్ణీత బరువు 50గ్రాముల గుడ్డును పంపిణీ చేయాలి. ఫారం కోళ్లు పెట్టే గుడ్డు చాలా వరకు హెచ్చుతగ్గులు ఉంటాయి. వీటిని సంబంధిత కాంట్రాక్టర్ చిన్నసైజ్ గుడ్లను తీసుకుని వాటిని తక్కువధరలకు కొనుగోలు చేసి అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్ణీత బరువు కలిగిన గుడ్డును నెక్ రేటుకు సరాసరి ధరతో పాటు రవాణా చార్జీలు అధనంగా చెల్లిస్తారు. అయితే పరిమాణం తక్కువ సరఫరా చేసినందుకు గానూ కాంట్రాక్టర్లకు అండగా ఉన్నవారికి వాటాలు అందుతున్నాయన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

**అధికారుల కనుసన్నల్లోనే..** అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణీలు, బాలింతలో పాటు ఆరు నెలల నుంచి ఆరుసంవత్సరాల్లోపు పిల్లలకు పౌష్టికాహారంతో పాటు భోజనం అందిస్తుంటారు. వీరికి అందించాల్సి గుడ్డు గుడ్డు నిర్ణీత పరిమాణానికి మించి తక్కువ సైజ్‌లో సరఫరా అవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంగన్‌వాడీ నిర్వాహకులు చిన్నసైజ్ గుడ్లను తిరస్కరిస్తే గుడ్ల సరఫరా చేసే వారు పైస్థాయి అధికారులతో వేధింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. లబ్దిదారులు ఇంత చిన్నగుడ్డునా.. అని ప్రశ్నిస్తే తీసుకుంటే తీసుకో లేకపోతే లేదని అంగన్‌వాడీ నిర్వాహకులు తేల్చి చెబుతున్నారు. అయితే ఇదంతా అధికారుల కనుసన్నల్లోనే జరుగుతుందని వారికి తెలిసినా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**పర్యవేక్షణ లోపమే కారణం..** మాతాశిశు ఆరోగ్యం పిసిపిల్లలకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ఆరోగ్యలక్ష్మి, బాలామృతం 7నెలల నుంచి 6ఏళ్లలోపు చిన్నారులకు తక్కువ, బరువు ఉన్న పిల్లలకు, గర్భిణులకు సప్లిమెంటరీ న్యూట్రిషన్ ప్రోగ్రామ్ (ఎస్ఎన్‌పీ) కింద బలవర్థకమైన ఆహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్నారు.7-72 నెలలు గల చిన్నారులకు రోజుకు రూ.6 తక్కువ బరువున్న చిన్నారులకు రూ.9,గర్భినీలకు రూ.7చొప్పున కేటాయిస్తున్నారు. చిన్నారులకు 12-15 గ్రాములు,గర్భినీలకు 18-20 గ్రాములు ప్రొటీన్లు అందేందుకు రోజువారీ ఆహారంలో గుడ్డు తీసుకోవడం ప్రధానమనేది దీని ముఖ్య ఉద్దేశం. కానీ కొన్ని కేంద్రాల్లో నామమాత్రపు పంపిణీ చేస్తున్నారు. లెక్కల్లో ఎక్కువగా చూపుతూ మిగిలిన వాటిని బయట విక్రయించుకుం టున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రెండళ్ల క్రితం ఐసీడీఎస్ అధికారులు జరిపిన క్షేత్ర స్థాయి తనిఖీల్లో పలు కేంద్రాలు అక్రమాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. వీరిపై చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధి కారులు సిద్ధమైనా రాజకీయ ఒత్తిళ్లతో విరమించుకు న్నారు. దీన్ని అలుసుగా తీసుకున్న మరికొన్ని కేంద్రాల నిర్వాహ కులు తప్పుడు లెక్కలతో చిన్నారులు, గర్భిణులకు అందాల్సిన పౌష్టికాహారం స్వాహా చేస్తున్నట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి.

## యువతను చెడు మార్గం వైపు వెళ్లకుండా కాపాడతా

**నన్ను కొలిచే వారిని చల్లంగా చూస్తా : భవిష్యవాణిలో అమ్మవారు**

**ప్రజలందరికీ అంతా సవ్యంగా జరిగేలా చూసుకుంటా.ధరలు తగ్గు ముఖం పడతాయి**



దండు మారెమ్మ ఆలయం వద్ద నిర్వహించిన రంగం కార్యక్రమంలో భవిష్యవాణి వినిపిస్తున్న స్వర్ణలత

బేగంపేట జులై 24,ప్రభాతవార్త : తనను కొలిచే భక్తులను ఎల్ల వేళలా కాచి కాపాడుకుటానని, ప్రజలందరికీ అంతా సవ్యంగా జరిగేలా చూసుకుంటానని,బాలంరాయి దండు మారెమ్మ ఆలయంలో సోమవారం జరిగిన రంగం కార్యక్రమంలో స్వర్ణలత భవిష్యవాణి వినింపించారు.బోనాల లో భాగంగా సోమవారం బాలంరాయి శ్రీదండు మారెమ్మ ఆలయంలో భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు.తెల్ల వారు ఝామున గం 3లకు బలిగంప కార్యక్రమం జరిగింది.అనంతరం రంగం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అమ్మ వారి ఎదురుగా పచ్చికుండపై నిల్చుని అమ్మ వారిని ఆవాహనం చేసుకున్న స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు.తన భక్తులందరినీ కాపాడుకుంటానన్నారు. అలాగే పెరిగిన కూరగాయల ధరలు త్వరలోనే తగ్గు ముఖం పడతాయన్నారు.యువత చెడు మార్గంలో పయనించకుండా తాను కాపాడుకుంటానన్నారు.ఆలయ అభివృద్ధికి అండగా ఉంటానని అన్నారు.రంగం కార్యక్రమం వినేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చారు.ఉదయం నుంచి ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు పోటెత్తారు.ఈ సందర్భంగా ఆలయం వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బేగంపేట ఇన్స్‌పెక్టర్ పి,శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పటిష్ట మైన బందోబస్తును ఏర్పాటు చేసారు.ఆలయానికి వచ్చిన భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఆలయ ఈ ఓ శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో పటిష్టమైన ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు.

## మణిపూర్‌కు మారణహోమానికి హోంమంత్రి రాజీనామా చేయాలి

**ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన**




నిరసన ప్రదర్శనలో మాట్లాడుతున్న ఎస్.ఛాయాదేవి

సైఫాబాద్, జులై 24 ప్రభాతవార్త: మణిపూర్‌లో అల్లర్లకు బాధ్యత వహిస్తూ కేంద్ర హోం శాఖ మంత్రి, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పదవులకు రాజీనామా చేయాలని, మహిళలపై అకృత్యాలకు పాల్పడుతున్న దుండగులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఎఐటియుసి, ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ, ఎఐవైఎఫ్, ఎఐఎస్‌ఎఫ్, డిహెచ్‌పిఎస్, సిపిఐ హైదరాబాద్ జిలా సమితి ఆధ్వర్యంలో ఆనేక మంది సోమవారం ఆనేక మంది కార్యకర్తలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. నల్లదుస్తులు ధరించిన వీరు హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్ నుంచి వై జంక్షన్ వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి మాట్లాడుతూ మణిపూర్ తగలబడిపోతుంటే ప్రధాని నరేంద్రమోదీ మౌనం వహిస్తున్నారని, తక్షణమే శాంతి భద్రతలు కల్పించేందుకు కే ంద్రం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన మహిళలపై జరిగిన అవమానీయ, అనాగరిక చర్యను తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం, ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ సీనియర్ నాయకురాలు పి.ప్రేమ్‌పావని తదితరులు పాల్గొన్నారు.

## యువతి గొంతు కోసిన ప్రేమోన్మాది

**నిందితుడు అరెస్ట్**



నిందితుడు ఉడుం లక్ష్మీనారాయణ (ఫైల్‌పోటో)



బాధితురాలు

ఉప్పల్, జూలై 24 ప్రభాతవార్త : ప్రేమ పేరుతో ఒక యువతిని మభ్యపెట్టి కారులో తీసుకెళ్లి గొంతు కోసిన సంఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, బందువులు తెలిపిన వివరాల ప్రకారం.. హబ్సిగూడలో నివసించే ఉడుం వెంకటయ్య కుమారుడు ఉడుం లక్ష్మీనారాయణ (27) గతంలో ఒక యూట్యూబ్ సంస్థలో పనిచేస్తున్నాడు. అతనికి అప్పటికే పెళ్లి జరిగి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇదే క్రమంలో అతనికి రామంతాపూర్‌లో నివసించే అతని బంధువు వరస అయిన అమ్మాయితో స్నేహానికి తెరతీసాడు. ఇద్దరు ఒకే సంస్థలో పనిచేస్తున్న సమయంలో అమ్మాయికి మాయమాటలు చెప్పి యువతితో స్నేహం చేశాడు. అతని ప్రవర్తన తెలిసి కొద్ది రోజులుగా యువతి అతనితో దూరంగా ఉంటుంది. ఇదే క్రమంలో ఈనెల 22వ తేదిన సాయంత్రం అమ్మాయిని కారులో తీసుకెళ్లి గుర్తు తెలియని ప్రదేశంలో కారు నిలిపి గొంతు గోసి పరారైయ్యాడు. అనంతరం యువతి అతని నుంచి తప్పించుకుని ఇంటికి చేరుకుని విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పింది. దీంతో వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో నిందితుడిని గాలించి సోమవారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి కత్తి, కారు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం సాయంత్రం నిందితుడు లక్ష్మినారాయణను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మొహార్రం ఊరేగింపునకు అంబారీ ఏనుగు రిహార్సల్



యాకుత్‌పుర, జూలై 24 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీలో మొహర్రం సంతాప దినాలను పురస్కరించుకుని ఈ నెల 29వ తేదీన షియా ముస్లిం ముస్లింలు నిర్వహించనున్న సామూహిక ఊరేగింపు సందర్భంగా సోమవారం పాతనగరంలోని ప్రధాన రహదారులలో అంబారీ రిహార్సల్ ఊరేగింపు జరిగింది. డబీర్‌పురలోని బీబీకాఆలం నుంచి ప్రారంభమైన అంబారీ రిహార్సల్ ఊరేగింపు ఎత్తెబార్‌చౌక్,సర్దార్ మహల్,చార్మినార్,గుల్జారాహౌస్,మీరాలం మండి, దారుషిఫా ప్రాంతాలు మీదుగా చాదర్‌ఘాట్ వరకు కొనసాగింది. అంబారీ రిహార్సల్ ఊరేగింపు సందర్భంగా గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.మీర్‌చౌక్ ఏసిపి దామోదర్‌రెడ్డి,చార్మినార్ ఏసిపి రుద్ర భాస్కర్‌లు శాంతి భద్రతలను పర్యవేక్షించారు.

## ఆర్.కృష్ణయ్య పోరాట ఫలితమే మెస్‌ఛార్జీల పెంపు

**బిసి యువజనసంఘం రాష్ట్ర కన్వీనర్ టి.రాజ్‌కుమార్**

హైదరాబాద్, జూలై 24,ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు మెస్‌చార్జీలు పెంచడం బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగిన పోరాట ఫలితమేనని బిసి యువజనసంఘం రాష్ట్ర కన్వీనర్ టి.రాజ్‌కుమార్ అన్నారు. ఈమేరకు విద్యానగర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బిసి,ఎస్సీ,ఎస్టీ గురుకులాలు కస్తూర్బా హాస్టళ్లలో ప్రస్తుత ధరలకుఅనుగుణంగా మెస్‌ఛర్జీలలు పెంచాలని ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో మంత్రి గంగుల కమలాకర్‌కు, బిసి సంక్షేమశాఖ అధికారులకు వనతులు సమర్పించి అనేక ధర్నాలు, ఉద్యమాలు చేయడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో బిసి సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందగోపాల్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు భూపేస్‌సాగర్,హేమంత్ నివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగాల్లో ప్రతిభ కనబర్చాలి : మంత్రి శ్రీనివాస్ గౌడ్



మహేంద్రహిల్స్‌ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ప్రసంగిస్తున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్

అడ్డగుట్ట,జూలై 24 ప్రభాతవార్త: విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగాల్లో అభివృద్ధి చెంది సమాజాభివృద్ధి కోసం పాటుపడాలని తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, యువజన సర్వీస్‌లు, క్రీడా శాఖ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. సోమవారం మహేంద్రహిల్స్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన హరిత హర కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మల్కా కొమురయ్య, అటవి శాఖ అధికారిని సలేహా అఫ్రోస్, స్కూల్ అడ్మినిస్ట్రేటర్ యశేశ్వీ ప్రిన్సిపాల్ నందిత సుంకర,వైస్ ప్రిన్సిపాల్ సుధా తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్**

హైదరాబాద్, జులై 24 ప్రభాతవార్త: జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో కార్యాకలాపాలను ముమ్మరం చేయాలని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుధాంశ్ నూతనంగా పదవీ బాధ్యతలను చేపట్టారు. డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్‌ను మర్యాదపూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేస్తూ ప్రజలకు అందు బాటులోకి తీసుకురావాలని సూచించారు. నియోజకవర్గంలో మురికివాడలు అధికంగా ఉండడం వల్ల ప్రజలా సమస్యల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపాలని పద్మారావు గౌడ్ సుధాంశ్‌కు వివరించారు.

## అందరినీ ఒక్కటి చేసేవి పండుగలు

**సినీ హీరో మంచు మనోజ్**



ఫలహారం బండి ఊరేగింపులో పాల్గొన్న మంచుమనోజ్ దంపతులు

హైదరాబాద్,జులై 24,ప్రభాతవార్త: ఎన్ని సమస్యలున్నా.. ఎన్ని మనస్పర్థలున్నా అందరినీ ఒక్కటి చేసేవి పండుగలేనని తనుక పండుగలంటే చాలా ఇష్టమని సినీహీరో మంచుమనోజ్ అన్నారు. సోమవారం అయ్యప్పసొసైటీలో ఎర్రగుడ్ల వెంకట్ యాదవ్, షణ్ముక్ యాదవ్, రంజిత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమంలో తన సతీమణి భూమా మౌనికతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మనోజ్-మౌనిక దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరంలో జరిగే బోనాల వేడుకలంటే తనకు ఎంతో ఇష్టమని పోతరాజుల విన్యాసాలు, నృత్యాలు, యువకుల ఉత్సాహం తనకు ఎంతో నచ్చుతాయన్నారు. అందరూ బాగుండాలి, ప్రతి ఒక్కరికి అమ్మవారి దీవెనలు ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఫలహారం బండి ఊరేగింపు సందర్భంగా పోతరాజులు, శివసత్తులు నిర్వహించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం వందలాదిగా విచ్చేసినా బస్తీవాసులు, భక్తుల నడుమ అమ్మవారి ఊరేగింపు ఉత్సాహ భరిత వాతావరణంలో ముందుకు సాగింది.

## డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను పూర్తి అయ్యేలా చర్యలు

**కార్పొరేటర్ శాంతిసాయిజన్ శేఖర్**



స్థానికులతో సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ శాంతిసాయిజన్ శేఖర్

నాచారం. జులై 24 ప్రభాతవార్త: నాచారం డివిజన్ పరిధిలోని అన్నపూర్ణ కాలనీలో డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ శాంతిసాయిజన్ శేఖర్ పేర్కొన్నారు. అన్నపూర్ణకాలనీలో రూ. 36లక్షల నిధులు మంజూరైనప్పటికి కాంట్రాక్టర్ పనులు చేయలేదు. దీంతో పనుల ఆలస్యం అవుతుండటంతో స్థానిక మహిళలు పనులు చేయవలసిన చోట ఆందోళన చేశారు. దీంతో విషయం తెలుసుకున్న కార్పొరేటర్ శాంతిసాయిజన్ శేఖర్ మహిళలతో మాట్లాడారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే పనులు నిలిచిపోయాయని అసరం అయితే తిరగి టెండర్ వేసి మరో కాంట్రాక్టర్‌తోనైనా పనులు జరిగేలా చూస్తామని వారిని సముదాయించారు. ఈ కార్యక్రమంలో జంగయ్య, విఠల్ యాదవ్, కిషోర్, శ్రీనివాస్, ఫైజ్ మోయినుద్దీన్, బాబురావు, మన్సూర్, లలిత, సుబ్బయ్య పాల్గొన్నారు.

## 110 వ రోజుకు చేరిన మాణికేశ్వరీనగర్ నిరహార దీక్ష



నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేయిస్తున్న వేముల శ్రీనివాస్

తార్నాక, జులై 24 ప్రభాతవార్త: మానికేశ్వరీనగర్ బస్తీలో స్థానికులు ఆసుపత్రి నిర్మాణం కోసం చేస్తున్న రిలే నిరహార దీక్ష 110వ రోజుకు చేరుకుంది. బీఆర్ఎస్ సీనియర్ నయకులు గండికోట కుమార్,ఒర్సు కృష్ణ, గోగుల శ్రీనివాస్ తధితరులు దీక్షలో కూర్చొని వారికి సంఘీభావం తెలిపారు. ఆసుపత్రి కోసం అందరం రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా ఉండి ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టేంతవరకు కృషి చేయాలని వారు పిలుపు నిచ్చారు. సాయంత్రం కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఏసీ నర్సింహ్మా, వేముల శ్రీనివాస్, ఆలకుంట లింగయ్య తదితరులు దీక్షలో కూర్చున్న వారికి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు.

## అకాల వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**కార్పొరేటర్ చీరె సుచిత్రా శ్రీకాంత్**



బేగంపేట జులై 24.ప్రభాతవార్త : నగరంలో సోమవారం రాత్రి కురిసిన అకాల వర్షం కారణంగా రాంగోపాల్‌పేట డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో కార్పొరేటర్ చీరె సుచిత్రా శ్రీకాంత్ సోమవారం రాత్రి సందర్శించారు.ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలైన మెక్లోడిగూడా, నల్లగుట్ట,బాపూబాగ్,లాలాటెంపుల్,పాన్ బజార్ తదితర ప్రాంతాల్లో నీరు నిల్చి ఉండటం వల్ల ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూసేందుకు ఎన్‌డీఆర్ఎఫ్ టీమ్‌తో ఆప్రాంతాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దన్నారు.

## ఐటి రంగంలో నగరాన్ని అగ్రభాగాన నిలిపిన ఘతన కెటిఆర్‌ది

**మాజీ కార్పొరేటర్ సాయిబాబా**



కేక్ కట్ చేసి మంత్రి కెటిఆర్ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న మాజీ కార్పొరేటర్ సాయిబాబా తదితరులు

గచ్చిబౌలి, జులై 24 ప్రభాతవార్త : ఐటి రంగంలో హైదరాబాద్ నగరాన్ని ప్రపంచంలోనే అగ్రభాగాన నిలిపిన ఘనత తెలంగాణ ఐటి, మున్సిపల్ శాఖ మంత్రి కెటి. రామారావుకు దక్కుతుందని గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా అన్నారు. మంత్రి కెటిఆర్ జన్మదిన వేడుకలను సోమవారం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని ఖాజాగూడలో గల బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ సాయిబాబా ఆధ్వర్యంలో డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ దిశగా మంత్రి కెటిఆర్ ముందుకు తీసుకువెళ్తున్నారన్నారు. ఐటి రంగంపై తనకు ఉన్న పట్టును ఆసరాగా చేసుకొని నేడు రాష్ట్రాన్ని ఐటి ఎగుమతుల్లో దేశంలోనే నెంబర్ వన్ స్థాయికి తీసుకువచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ గచ్చిబౌలి డివిజన్ మాజీ అధ్యక్షుడు చెన్నంరాజు, వార్డు సభ్యులు రాగం జంగయ్య యాదవ్, అంజమ్మ, దారుగుపల్లి నరేష్, ఏరియా కమిటీ సభ్యులు శాంకరి రాజుముదిరాజ్, అశోక్‌యాదవ్, నాయకులు రమేష్‌గౌడ్, గోవింద్, నారాయణ పాల్గొన్నారు.

## దివ్యాంగులకు శాశ్వత ప్రాతిపదికన ఉపాధి కల్పించాలి

సైఫాబాద్, జులై 24 ప్రభాతవార్త: శారీరకంగా, ఆర్థికంగా, సామాజికంగా అత్యంత వెనుకబడి ఉన్న దివ్యాంగులకు పెన్షన్‌తోపాటు శాశ్వత ప్రాతిపదికన ఉపాధి కల్పించాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ కే ంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఆప్ రాష్ట్ర కార్యాలయంలో అఖిల భారత దివ్యాంగుల హక్కుల ఫోరం అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర్‌రావు సోమవారం సుధాకర్‌ను కలిసి దివ్యాంగులకు కమీషన్ ఏర్పాటుకు ప్రభుత్వాలపై వత్తిడి తెచ్చి తమ ఉద్యమానికి మద్దతు తెలపాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 41, 7వ షెడ్యూల్డ్‌లోని రాష్ట్ర జాబితా ప్రకారం అంగ వైకల్యం ఉన్నవారికి ప్రభుత్వ సహాయం పొందేహక్కు ఉందన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాలైన దివ్యాంగులు ఇప్పటివరకు సమాన అవకాశాలు, హక్కులు, పూర్తిస్థాయి భాగస్వామ్యం పొందలేకపోతున్నారని, దీంతోపాటు చట్ట సభలలో రాజకీయ ప్రాతినిధ్యం కూడా లేదన్నారు.

## థ్రిల్ సిటీలో మంత్రి కెటిఆర్ జన్మదిన వేడుకలు



థ్రిల్ సిటీలో మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలలో మంత్రులు తలసాని,మహమూద్ఆలీ,సాయికిరణ్ యాదవ్,డిప్యూటీ మేయర్

బేగంపేట జులై 24,ప్రభాతవార్త : మంత్రి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకలు సోమవారం పీ.వీ మార్గ్‌లోని థ్రిల్ సిటీ థీమ్ పార్క్‌లో యువనేత సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా, వినూత్నంగా జరిగాయి. ఈ వేడుకలకు రాష్ట్ర హోంమంత్రి మహమూద్ ఆలీ,పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ లు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు.వీరితో పాటు ఎమ్మెల్సీ ప్రభాకర్ రావు,ఎగ్గెమల్లేశం,స్టీఫెన్‌సన్,ఎమ్మెల్యే ముఠాగోపాల్,కార్పోరేషన్ చైర్మన్లు గజ్జెల నాగేష్,కోలేటి దామోదర్‌గుప్తా, అనిల్‌కుమార్,కూర్మాచలం,డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్ రెడ్డి,నగర గ్రంధాలయ సంస్థ చైర్మన్ ప్రసన్న,కార్పోరేటర్లు కుర్మ హేమలత,టి.మహేశ్వరి,మాజీ గ్రంధాలయ సంస్థ చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్,మాజీ కార్పోరేటర్లు, నామన శేషుకుమారి,అత్తెల్లి అరుణాగౌడ్,ఉప్పల తరుణి నాయి.సీనియర్ నాయకులు క్యామ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.కేటీఆర్ జన్మదిన వేడుకలలో భాగంగా ప్రపంచ రికార్డు సాధించిన రూబిక్స్ క్యూబ్ ఆర్టిస్ట్ ఇర్ఫాన్ కుట్టి కండ్లకు గంతలు కట్టుకొని రూబిక్ క్యూబ్స్‌తో రూపొందించిన కేటీఆర్ చిత్రం హ్యాపీ బర్త్‌డే కేటీఆర్ అన్న విషెస్ ఆహ్వానితులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

## అక్రమంగా ఆయిల్ బాటిళ్లను రవాణా చేస్తున్న నిందితుల రిమాండ్

పేట్‌బషీరాబాద్,జులై24 ప్రభాతవార్త: విశ్వసనీయ సమాచారం మేరకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు షాపూర్‌నగర్ నుంచి జీడిమెట్లకు వెళ్ళే పైపులైన్ రహదారిలో సోమవారం తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో అనుమానాస్పదంగా కనిపించిన హోండా ఆక్టివా ద్విచక్రవాహనం(టీఎస్08జికె3956)ను సోదా చేయగా 32 హాషిష్ ఆయిల్ బాటిల్స్ లభించాయి. నిందితుడిని విచారించి సనత్‌నగర్‌కు చెందిన మనోజ్‌కుమార్‌గా గుర్తించారు. మనోజ్‌కుమార్ తెలిపిన సమాచారం ప్రకారం ఈ హాషిష్ బాటిల్స్‌లను మచిలీపట్నంకు చెంది న అరవింద్‌కుమార్ నుంచి జగద్గిరిగుట్టకు చెందిన శ్రీనివాస్ చారి కొనుగోలు చేసి తనకు ఇస్తాడని, బాటిళ్లను విక్రయించిన లాభాల్లో ఇరువురం భాగస్వాములమని తెలిపాడు. నిందితులలో ఒకడైన మనోజ్ కుమార్‌ను అదుపులోకి తీసుకొని 32 హాషిష్ బాటిళ్ళు, ఒక మొబైల్ ఫోన్, హోండా ఆక్టివా ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని,మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు.


## వైభవంగా తెలంగాణ బోనాల ఉత్సవాలు




నాట్యగురువులు, చిన్నారి కళాకారిణులను పురస్కారాలతో సత్కరిస్తున్న సందీప్‌కుమార్, రాగిణి, జయసుధ

నాంపల్లి, జులై 24 ప్రభాతవార్త : నేడు కళలు, ముఖ్యంగా నాట్యరంగం కన్నులపండువగా మిగిలి ఉండడానికి కారణం ముందుగా కళాపోషకులైన తల్లిదండ్రులేనని, నాట్యాన్ని నేర్చుకోవడం కాదు, నాట్య కళలో లీనమై ప్రేమించాలని, గురువును నమ్మాలి, అప్పుడే విద్యార్థి పరిపూర్ణత సాధిస్తాడని స్పష్టం చేశారు. తెలంగాణ బోనాల ఉత్సవాల సందర్భంగా అమ్మవారి ప్రతిరూపాలైన 3 సంవత్సరాల చిన్నారుల మొదలు ఉదయం నుండి రాత్రి వరకు తమ అద్భుత సంగీత నృత్యప్రదర్శనలను సుమధుర గాత్రం, అందెల సవ్వడి, రవళితో గురువుల ఆశీస్సులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో విజయ మాధవి అందించిన రంగస్థల వేదికపై వారి ఆహార్యం, పదముద్రికలు, నృత్యార్చన ఆధ్యాత్మిక లోకంలో విహరింపజే శాయని అతిథులు తమ ప్రసంగాల్లో అభినందించారు. ప్రముఖ విజయ మాధవి సేవా సాంస్కృతిక అకాడమీ ఆధ్వర్యంలో తెలంగాణ బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా అమ్మవారిని స్తుతిస్తూ చిన్నారి కళాకారుల సంగీత నృత్యప్రదర్శనలు ఉర్రూతలూగించి విచ్చేసిన అశేష ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ఈ కార్యక్రమానికి ప్రముఖ అతిథులు అనుప్రసాద్, ప్రముఖ నటి రాగిణి, ఎన్‌సిసి అధికారి మేజర్ డి.జయసుధ, డా. చిన్మయి తమ్మారెడ్డి, చిత్ర, రష్మిక, దినకర్ పాల్గొని ఈనాటి నృత్యప్రదర్శనల్లో పాల్గొన్న చిన్నారి కళాకారుల గురువులను ఘనంగా సత్కరించారు.

## శ్రీ హరినామ్ అఖండ్ తాల్ సప్తాహ్ కార్యక్రమం



చార్మినార్,జులై 24 ప్రభాతవార్త : అధిక మాసం సందర్భంగా శ్రీ హరి భక్త భజన మండలి ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీ నుంచి ఆగష్టు నెల 6వ తేదీ వరకు ఘాన్సీ బజార్‌లోని వైదిక వచనాలయంలో అత్యంత వైభవంగా శ్రీ హరినామ్ అఖండ్ తాల్ సప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండలి ప్రతినిధులు పండిత్ విశేష్ శర్మ,టి.సునీల్ కుమార్‌లు తెలిపారు.29వ తేదీ శనివారం సాయంత్రం 6 గంటలకు చార్మినార్ శ్రీ మహదేవ్ మందిరం నుంచి భవ్య శోభా యాత్ర ప్రారంభమై పలు ప్రాంతాలలో కొనసాగిన అనంతరం వైదిక వచనాలయంలోని శ్రీ వృందావన్ దామ్‌కు చేరుకుంటుందని వారు తెలియజేశారు.వారం రోజుల పాటు హరి కీర్తనలు,భజన కార్యక్రమాలను నిర్వహించనున్నారు.ఆగష్టు 6వ తేదీ ఉదయం 5 గంటలు నుంచి కాగడ హారతి,11 గంటలు నుంచి హావన్,సాయంత్రం 5నుంచి రాత్రి 8 గంటలు వరకు భండారా తదితర కార్యక్రమాలు జరగనున్నాయని వారు తెలియజేశారు.చార్మినార్ ఏసిపి రుద్రభాస్కర్ ముఖ్య అతిధిగా విచ్చేసి కళశ యాత్రను ప్రారంభిస్తారని గత 51 సంవత్సరాలు నుంచి ప్రతీ మూడు సంవత్సరాలకు ఒకసారి అధిక మాసంలో శ్రీ హరినామ్ అఖండ్ తాల్ సప్తామ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వారు తెలిపారు.




## కాచిగూడ ఎసిపిని సన్మానించిన భజరంగసేనా ప్రతినిధులు

అఫ్జల్‌గంజ్,జులై 24ప్రభాతవార్త:కాచిగూడ సబ్ డివిజన్ ఏ.సి.పిగా పదవి భాధ్యతలు చేపట్టిన కె.శ్రీనివాస్‌ను తెలంగాణ భజరంగ్‌సేనా ప్రతిధులు మర్యాద పూర్వకంగా కలిశారు.అనంతరం ఏ.సి.పి కె.శ్రీనివాస్‌ను తెలంగాణ భజంగ్ సేనా అధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావుగుప్త శాలువ కప్పి సన్మానించారు. ఈకార్యక్రమంలో భజరంగ్ సేనా ప్రతినిధులు శ్రీనివాస్‌గుప్త,మనోజ్,అభినవ్ తివారి,ప్రవీన్ యాదవ్,వినిత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నాయకులతో ప్రత్యేక డిఎంసి సమావేశం



జిహెచ్ఎంసి సర్కిల్ 14 డిఎంసి కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్

బేగంబజార్, జులై 24ప్రభాతవార్త: మహానగర పాలక సంస్థ సర్కిల్ 14 డిప్యూటి మున్సిపల్ కమీషనర్‌గా భాధ్యతలు చేపట్టిన డి.బాలయ్య వివిధ పార్టీల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోషామహల్ నియోజకవర్గంలోని పలు డివిజన్‌లో అభివృద్ధి పనులపై చర్చించారు. జాంబాగ్ డివిజన్ బిజెపి కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ పలు సమ్యలపై అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.రాబోయే ఎన్నికలపై ఓటర్ల జాబితాను ప్రకటించాలన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు,అధికారులు పాల్గొన్నారు.

## బిజెపి టిఫిన్ బైటక్ కార్యక్రమం



టిఫిన్ బైటక్ కార్యక్రమంలో బీజేపి శ్రేణులు

నిజాంపేట్,జులై24 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర బీజేపి పార్టీ పిలుపు మేరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సోమవారం నిజాంపేట్ మల్లన్న దేవాలయం వద్ద టిఫిన్ బైటక్ కార్యక్రమాన్ని బీజేపి నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపి నాయకులు మట్లాడుతూ ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం బీజేపి పార్టీలో పనిచేసే వ్యక్తులం దరూ ఒకే కుటుంబమని గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్ర బీజేపి అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎలక్షన్ కమిటీ చైర్మన్ ఈటెల రాజేందర్ ఆధ్వర్యంలో బీజేపిని అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపి నాయకులు మాజీ ఎంపీ చాడ సురేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, మాధవి, మల్లారెడ్డి, బుచ్చిరెడ్డి, శంకర్‌రెడ్డి, బీజేపి శ్రేణులు పాల్గొన్నారు.

## వినాయకనగర్‌లో కార్పొరేటర్ పర్యటన



కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి వినాయక్‌నగర్‌లో పాదయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి,జులై 24 ప్రభాతవార్త : మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని వినాయక్‌నగర్‌లో సోమవారం జిహెచ్ఎంసి కౌన్సిల్ విప్,కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పలు ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులతో కలసి పాదయాత్ర నిర్వహించారు. వినాయక్ నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్లు పనులు,భూగర్భ డ్రైనేజి వ్యవస్థ పైప్ పనులు,వీధి దీపాలుమధుబన్ కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.జిహెచ్ఎంసి అధికారులు ఈఈ నాగేందర్ గౌడ్,డిఇ శంకర్,ఎఇ బల్వంత్‌రెడ్డి,వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్,భాను,వాటర్ వర్క్స్ అధికారులు జమీల్,సూపర్ వైజర్ వినయ్, లోక్‌నాథ్ బిజెపి నాయకులు అడికే జనార్ధన్, బుచ్చిండ్డి,ఎల్‌వి రెడ్డి,నర్సింగ్,ప్రదీప్,నవీన్, అంజమ్మ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల బస్‌డిపో సమీపంలోని ఖాళీ ప్రదేశంలో బస్ టెర్మినల్ ఏర్పాటుకు కృషి చేయాలని సోమవారం ఎమ్మెల్యే కెపి వివేకానంద్‌కు వినతి పత్రం అందజేస్తున్న సామాజిక కార్యకర్త కోలా రవిందర్ ముదిరాజ్, తదితరులు

## కెసిఆర్ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారు: హోంమంత్రి



ఎస్‌పిఆర్ హిల్స్‌లో నాకౌట్ క్రికెట్ టోర్నమెంటు ప్రారంభోత్సవంలో పాల్గొన్న హోంమంత్రి మహ్మద్ మహమూద్ ఆలీ, జూబ్లీహిల్స్ శాసన సభ్యులు మాగంటిగోపినాథ్

యూసుఫ్‌గూడ, జులై 24, ప్రభాతవార్త : ముఖ్యమంత్రి కేసీఆర్ క్రీడాకారులను అన్ని విధాల ప్రోత్సహిస్తున్నారని రాష్ట్ర హోం శాఖ మంత్రి మహ్మద్ మహమూద్ ఆలీ అన్నారు. సోమవారం రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్‌పిఆర్ హిల్స్ లోని ఎమ్‌జిఎన్ గ్రౌండ్‌లో జూబ్లీహిల్స్ శాసన సభ్యులు మాగంటిగోపినాథ్ ఆధ్వర్యంలో నియోజకవర్గానికి చెందిన 7డివిజన్‌ల క్రీడాకారులకు నాకౌట్ క్రికెట్ టోర్నమెంటును ఏర్పాటు చేశారు. ఈ టోర్నమెంటుకు ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రారంభించారు. అదేవిధంగా నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌ల కార్యకర్తలకు గిఫ్ట్‌ఏస్మైల్‌లో భాగంగా 200ఎలక్ట్రానిక్ స్కూటీలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలు ఎంతో కష్టపడి పనిచేస్తున్నారని వారికి అన్ని విధాల అండగా నిలిచేందుకు తమ వంతుగా ఈబహుమతులను అందజేయడం జరిగిందన్నారు. నియోజకవర్గం అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఎంతో సహాయ సహకారాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్‌లు సిఎన్‌రెడ్డి, రాజ్‌కుమార్ పటేల్, దేదిప్యరావు, డివిజన్ అధ్యక్షులు డి.సంజీవ, వేణుగోపాల్ యాదవ్, ప్రదీప్, అప్పుఖాన్, కృష్ణమోహన్, సంతోష్ ముదిరాజ్, జిటియస్ దేవాలయం చైర్మన్ చిన్నరమేష్, విజయసింహ, సిరాజ్, శ్యామ్‌రావు ముదిరాజ్, పవన్ ముదిరాజ్, సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చేస్తే బిజెపి అంతం

**మాల ప్రజా సంఘాల జెఎసి చైర్మన్ జి.చెన్నయ్య హెచ్చరిక**



నిరసన ప్రదర్శనలో ప్రసంగిస్తున్న జి.చెన్నయ్య

సైఫాబాద్, జులై 24 ప్రభాతవార్త: ఎన్నికలకు సమీపంలో ప్రతిసారి దేశంలో ఏదోక సమస్య సృష్టించి మతాలు, కులాల మధ్య చిచ్చు రాజేసి ఓట్లు దండుకునే ప్రయత్నం బిజెపి చేస్తున్నదని, దీన్ని దేశ ప్రజలంతా గమనిస్తున్నారని ఆ పార్టీ తగిన మూల్యం చెల్లించుకుంటుందని మాల ప్రజా సంఘా జెఎసి చైర్మన్ జి.చెన్నయ్య హెచ్చరించారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు వ్యతిరేకంగా జెఎసి ఆధ్వర్యంలో సోమవారం ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట నిర్వహించిన నిరసన ప్రదర్శనలో చెన్నయ్య మాట్లాడారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడి బాధ్యతుల చేపట్టిన వెంటనే వర్గీకరణ చేస్తామని ప్రకటించడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. దళితుల మధ్య సమసిపోయిన వర్గీకరణ అంశాన్ని తిరిగి తెరపైకి తీసుకువచ్చి దళితుల మధ్య చీలికలు తెవడం ద్వారా ఒక వర్గం ఓట్లు రాబట్టుకోవచ్చునే ఆలోచనలో ఉన్నారని ఆరోపించారు. ఈ నిరసన ప్రదర్శనలో జెఎసి నాయకులు శ్రీనివాస్, నాగరాజు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగులకు 'తెలంగాణ ఇన్సెంటివ్' మంజూరు చేయాలి

**తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.హన్మంత్‌రెడ్డి**



ప్రసంగిస్తున్న తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.హన్మంత్‌రెడ్డి

హైదరాబాద్, జులై 24 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా రిటైర్డ్ ఉద్యోగులకు 'తెలంగాణ ఇన్సెంటివ్' మంజూరు చేయాలని తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.హన్మంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం చిక్కడపల్లిలోని తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది ఈ సందర్భంగా సమావేశంలో పలు సమస్యలను పరిష్కరించాలని తీర్మాణించారు. ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు ప్రతి నెల మొదటి తేదీ పెన్షన్‌లు చెల్లించాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలనని, పెన్షనర్‌లుగా రావాల్సిన బకాయి ఉన్న మూడు కరువు భత్యాలను వెంటనే విడుదల చేయాలని, రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించే కమ్యునికేషన్ విలువ తిరిగి చెల్లించే కాలానినన ప్రస్తుతం ఉన్న 15 సంవత్సరాలకు బదులుగా 12 సంవత్సరాలకు కుదించాలన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.నారాయణ, ఆర్థిక కార్యదర్శి బి.విశ్వనాథం, సలహాదారు ఇ.బాలయ్య పాల్గొన్నారు.


## మైనర్ బాలికపై అత్యాచారం.. కేసు నమోదు

తార్నాక, జులై 24 ప్రభాతవార్త: లాలాపేట్ సత్యనగర్‌లో ధారుణం జరిగింది. ఓ మైనర్ దళిత బాలికపై యువకుడు మాయామాటలు చెప్పి అత్యాచారానికి పాలుపడ్డాడు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ సంఘటన ఇన్స్‌పెక్టర్ మధులత కథనం ప్రకారం. లాలాపేట్ సత్యనగర్‌కు చెందిన హరిక్రిష్ణ అలియాస్ హరి(21) స్థానికంగా పేయింటర్ పనిచేస్తున్నాడు. ఓ మైనర్ బాలిక(13)తో మాయ మాటలు చెప్పి పరిచయం చేసుకున్నాడు. రోజు మాట్లాడుతూ ఆమెతో స్నేహంగా ఉంటున్నట్లు నటిస్తున్నాడు. ఈ క్రమంలో గత ఆదివారం బాలిక ఇంట్లో ఎవరు లేని సమయాన్ని అదునుగా చూసుకొని ఆమె ఇంట్లోకి వెళ్లాడు. మాయమాటలు చెప్పి ఆమెపై అత్యాచారం చేశాడు. అప్పటి నుంచి బాలిక ఆందోళనగా ఉండటం చూసిన ఆమెను కుటుంబ సభ్యులు గ్రహించి మందలించారు. దీంతో ఆమె జరిగిన దారుణాన్ని ఏడ్చుకుంటూ చెప్పింది. తీవ్ర మనోవేదనకు గురైన ఆమె తల్లి,తండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితుడిపై పోక్సో యాక్ట్, ఎస్సీ,ఎస్టీ యాక్ట్‌ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు అదుపులో నిందితుడు ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## సినారె లలిత గీతాలు సుగంధ పరిమళాలు

చిక్కడపల్లి, జులై 24 ప్రభాతవార్త: భాషలో భావనలో సినారె రచించిన లలిత గీతాలు సుకుమారంగా సుగంధ పరిమళాలు వెదజల్లుతాయని ప్రముఖ పాత్రికేయులు, నేటినిజం పత్రిక ఎడిటర్ బైసా దేవదాస్ అన్నారు. ప్రముఖ సాహితీవేత్త, సినీకవి, దర్శకులు డాక్టర్ వడ్డేపల్లి కృష్ణకు ఆత్మీయ సత్కార కార్యక్రమం రాగరాగిణి సాహితీ, సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.వి.రమణకుమారి, ఎంవి.సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాలలిత కళావేదికలో జ్ఞానపీఠ పురస్కారగ్రహీత, పద్మభూషణ్ డాక్టర్ సి.నారాయణరెడ్డి 92వ జయంతి సందర్భంగా జరిగింది. ముఖ్యఅతిథులుగా బైసా దేవదాస్ హాజరై ఈ పురస్కారాన్ని డాక్టర్ వడ్డేపల్లి కృష్ణకు అందించి గౌరవించారు. వడ్డేపల్లి కృష్ణ తెలంగాణ మట్టి నుంచి కవిగా ఎదిగారని, ఆయన గీతాల్లో సినారె శైలి, దేవులపల్లి శాస్త్రి ముద్ర కనిపిస్తాయన్నారు.

## బోనాల వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి శంకర్ రావ్



అంబేద్కర్ నగర్ పోచమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి శంకర్ రావ్, మాజీ కార్పొరేటర్ లాస్య నందిత

కంటోన్మెంట్, జులై 24 ప్రభాతవార్త: బోనాల వేడుకలను పురస్కరించుకొని కంటోన్మెంట్ నియోజకవర్గంలోని అంబేద్కర్ నగర్,మారేడ్‌పల్లి, లోహియ నగర్, పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన బోనాల వేడుకలకు మాజీ మంత్రులు సర్వే సత్య నారాయణ, డాక్టర్ శంకర్ రావ్, కంటోన్మెంట్ దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురు లాస్య నందిత,నివేదిత, మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బిజెపి నాయకురాలు సుస్మిత, ఎస్సీ కార్పోరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవిలు ఆయా ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అల్లాడి గౌరి శంకర్, ప్రధాన కార్యదర్శిలు నందికంటి రవి, కాంగ్రెస్ నేతలు తాటికాయల యేసు రత్నం, డి.బాబురావ్‌లు, కంటోన్మెంట్ బిజెపి ఎస్సీ సెల్ కన్వీనర్ చిన్న వీరయ్య, ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు మేకల చందర్, బత్తుల నారాయణ, ఎస్.రాము, బాబయ్య యాదవ్, పంగ రాజయ్య, రౌతు రాజయ్యలు, బాల్ నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలి: భాగ్యలక్ష్మి

మలక్‌పేట జులై 24 ప్రభాతవార్త : పేదలకు డబల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ వివక్షత ధోరణితో వ్యవహరిస్తున్నారని ముసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి ఆరోపించారు శ్రీపురం కాలనీ బంజారా కాలనీ లో ప్రభుత్వం అందించే రెండు పడకల గదుల ఇళ్లకు సంబంధించి అర్హులైన వారి వద్ద నుంచి దరఖాస్తులను ఆమె స్వీకరించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డబల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తులు స్వీకరించి 25వ తేదీన ఇందిరాపార్క్ వద్ద ఉన్న ధర్నా చౌక్ లో బిజెపి ఆధ్వర్యంలో మహాధర్న కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

